క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జనార్దన్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో చందుపట్ల వెంకటేశ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని, ఆటల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మాజీ సర్పంచ్ పరందాములు, మాజీ ఉపసర్పంచ్ చందుపట్ల రాజేందర్, గూళ్ల శ్రీనివాస్, ఎం.సురేందర్, ఎం.రమేష్, ఎం.శ్రీనివాస్, కె.సమ్మయ్య, కె.కుమారస్వామి, క్రీడాకారులు కె.పర్శరాములు, బి.ప్రశాంత్, బి.రాజు క్రీడాకారులు పాల్గొన్నారు.

బీసీలపై ప్రభుత్వం కపటప్రేమ

మానకొండూర్: బీసీలపై ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తుందని వైఎస్సార్‌టీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జాగిరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని గునుకుల కొండాపూర్‌లో మాట్లాడారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీల సంక్షేమానికి రూ. 5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష ఆర్థికసాయం ప్రతీ బీసీ కుటుంబానికి వర్తింపజేయాలనిచ ఇందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ఓట్ల కోసమే బీసీలను వాడుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. రాబోయే రోజుల్లో బీసీల ఆగ్రహానికి గురికావాల్సిందేనని, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరిగిందని, మరో నెల రోజులు గడువు పొడిగించాలని కోరారు.

'కవ్వంపల్లి'కి కృతజ్ఞతలు

మానకొండూర్: గన్నేరువరం మండలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణకు తిప్పర్తి పరిపూర్ణాచారి గురువారం కృతజ్ఞతలు తెలిపారు. నియామకానికి సహకరించిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపి 2024లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.

గోపాల్‌రావుపేట లయన్స్ క్లబ్ కార్యవర్గం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్ర ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అట్ల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా రాంపల్లి శ్రీనివాస్, వీపీ–1గా మచ్చ గంగయ్య, వీపీ–2గా దుండ్ర మల్లారెడ్డి, డైరెక్టర్లుగా కర్ర శ్యాంసుందర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, చాడ దామోదర్‌రెడ్డి, కర్ర రాజిరెడ్డి, ముదుగంటి రాజిరెడ్డి, ముదుగంటి సత్యనారాయణరెడ్డి, ముదుగంటి చంద్రశేఖర్‌రెడ్డి, మోర కేతా, గోలి శ్రీమతి, కొడిమ్యాల వెంకటరమణ, జిన్నారం విద్యసాగర్ ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా కార్యక్రమానికి హాజరైన లయన్స్ క్లబ్ జిల్లా ఉపగవర్నర్ లయన్ సింహరాజు కోదండరాములు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటరమణారెడ్డి, మోర భద్రేశం, బుర్ర మధుసూదన్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ లక్ష్మయ్య, అంజయ్య పలువురు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో నిలిచిన టిప్పర్



తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని చేపల కాలనీ సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం సాయంత్రం జాయింట్ విరగడంతో టిప్పర్ రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎల్ఎండీ పోలీసులు లారీని పక్కకు తరలించారు. ఫిట్‌నెస్ లేని వాహనం మట్టి తరలింపునకు వాడుతుండడంతో రోడ్డుపై అర్ధంతరంగా ఆగిపోయిందని స్థానికులు తెలిపారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి



హుజూరాబాద్: అమరులకు నివాళి అర్పిస్తున్న కౌశిక్‌రెడ్డి, తదితరులు



చిగురుమామిడి: అమరుల కుటుంబాలను సన్మానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్



మానకొండూర్: నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు అధికారులు

చొప్పదండి: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చొప్పదండి మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మండల పరిషత్‌లో ఎంపీపీ చిలుక రవీందరు అమరులకు నివాళి అర్పించి అమరుల త్యాగాలు వెలకట్టలేనివి అని అన్నారు. మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, వైస్ చైర్ పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, మేనేజర్ ప్రశాంత్ కుమార్, తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో ఇనుకొండ స్వరూప, ఎంపీవో రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు.

గంగాధర: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అమరులకు నివాళులర్పించారు.

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమరుల ఆశయాలను, ఆశలను నెరవేరుస్తూ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్, ఏసీపీ కోట్ల వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, ఎంపీపీ రాణి, వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్‌లు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కళాకారులు ఆలపించిన ఆట,పాటలు ఆకట్టుకున్నాయి.

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, ఉద్యోగులుమౌనం పాటించి నివాళి లర్పించారు.

వీణవంక: మండల పరిషత్ కార్యాలయంలో అమరుల త్యాగాలను స్మరిస్తూ ఎంపీపీ ముసిపట్ల రేణుక, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్ నివాళులు అర్పించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మడుగూరి సమ్మిరెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

సైదాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో అమరవీరుల ఫ్లెక్సీ ఏర్పాటు చేసి అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళి అర్పించారు. కొత్త బస్టాండ్ ఆవరణలో అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో పద్మావతి, తహసీల్దార్ బావ్ సింగ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ కార్యాలంయం సమీపంలోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అమరులకు నివాళి అర్పించారు. అమరుల ఆశయాలకు పాటుపడుతామని తీర్మానం చేయగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి కలెక్టర్, సీడీఎంఏ ఉన్నతాధికారులకు పంపించారు. రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించినవారి జీవితాలు వెలకట్టలేమని, వారి మాశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కమిషనర్ శ్రీనివాస్, మేనేజర్ భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మికుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొడ్డె మమత అధ్యక్షతన అమరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కల్పన అమరుల ఆశయాల అనుగుణంగా పాటు పడతామని తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కలెక్టర్‌కు తీర్మానం పంపించారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలో ఊరూరా అమరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మల్యాల గ్రామపంచాయతీ , ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సర్పంచ్ గురుకుంట్ల సాంబయ్య,హెచ్ఎం విజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అమరులకు నివాళి అర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పావని ఆధ్వర్యంలో, తహసీల్దార్ కార్యాలయంలో అమరవీరులకు నివాళిలర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు విద్యార్థులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామంలో తెలంగాణ అమరవీరుడు సుధగోని రాజేష్ గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ బోళ్ల వేణు, ఎంపీటీసీ గడ్డి రేణుక, మాజీ ఎంపీటీసీ గడ్డి గణేశ్, కారోబార్ నరసయ్య, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు

మానకొండూర్: గన్నేరువరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో అమరులకు నివాళులు అర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సాధ్యమైందన్నారు. ఎంపీడీవో స్వాతి, ఎంపీవో పీవీ నర్సింహారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గుడెల్లి ఆంజనేయులు, ఎంపీటీసీ అటికం రాజేశం, నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, న్యాత సుధాకర్, బొడ్డు సునీల్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్ రూరల్: అమరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎంపీపీ ముద్దసాని సులోచన అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీ డీఓ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ కా ర్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మబలిదానాలు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులను మంత్రి గంగుల కమలాకర్ ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్‌లో అమరులకు నివాళి అర్పించారు. బూర్గు రాజయ్య చిగురుమామిడి, సుదగోని శ్రీహరి ఇందుర్తి, గాగిరెడ్డిపల్లికి చెందిన దారవేని కొంరవ్వకు మంత్రి, జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ శాలువాలు కప్పి మెమొంటోలను బహూకరించారు. కార్యక్రమంలో చిగురుమామిడి జెడ్పీటీసీ గీకురు రవీందర్, తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అమరవీరుకు నివాళి అర్పించారు. ఎంపీపీ కొత్త వినీత మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఎందరో యువకులు ప్రాణాలు అర్పించారని, సీఎం కేసీఆర్ పాలనలో ఆయా కుటుంబాలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శంకరపట్నం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి అమరులకు నివాళి అర్పించారు. ఎంపీడీవో బషీరొద్దీన్, ఎంపీపీ సరోజన, వైస్ఎంపీపీ రమేశ్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి: నివాళి అర్పిస్తున్న గుర్రం నీరజ



హుజూరాబాద్‌రూరల్: నివాళి అర్పిస్తున్నమున్సిపల్ ఉద్యోగులు



మానకొండూర్: చెంజర్ల గ్రామంలో..



ఇల్లందకుంట: మల్యాలో మౌనం పాటిస్తున్న విద్యార్థులు

నిర్వాసితులకు పరిహారం అందించాలి



నిరాహార దీక్షకు బీఎస్పీ నాయకుల సంఘీభావం

గంగాధర: కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణంలో వ్యవసాయ భూములు కోల్పోతున్న రంగరావుపల్లి గ్రామానికి చెందిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవీందర్, నియోజకవర్గ అధ్యక్షుడు నల్లాల రాజేందర్ డిమాండ్ చేశారు. పరిహారం కోరుతూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు గురువారం నాయకులు సంఘీభావం తెలిపారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చొరవ తీసుకొని పరిహారం అందేలా చూడాలని కోరారు. నిరాహార దీక్షలో బచ్చు మల్లారెడ్డి, నిమ్మ మల్లారెడ్డి, దోమకొండ నర్సయ్య, గంగాధర మల్లారెడ్డి, ద్యావ మల్లారెడ్డి, కత్తెరపాక లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేత పథకాలపై అవగాహన



పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకార సంఘం కార్యాలయంలో గురువారం చేనేత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా చేనేత, జౌళిశాఖ ప్రాంతీయ వరంగల్ ఉపసంచాలకులు అశోక్‌రావు, కరీంనగర్ సహాయ సంచాలకులు సంపత్, అభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి చేనేత కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే పథకంలోని ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖాధికారులు అనిత, వెంకటేష్, హెచ్‌డబ్ల్యూసీఎస్ కృష్ణప్రసాద్, పర్సనల్‌ఇన్‌చార్జి ఉపేందర్, యాదగిరి, మహాదేవ్, వెంకటయ్య, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన కొలెపాక పరమేశ్‌అఖిల దంపతుల కూతురు హన్సిక(రెండేళ్లు) అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పేద కుటుంబం కావడంతో తూడి లచ్చయ్య యువసేన సభ్యులు గురువారం వైద్య ఖర్చుల కోసం చిన్నారి తల్లిదండ్రులకు రూ.పదివేల ఆర్థికసాయం అందించారు.

సమాజ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



అధ్యాపకులను సన్మానిస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: సమాజాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. గురువారం కళాశాలలో కంప్యూటర్ సైన్స్ థ్యాంక్స్ వింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థి జీవితానికి, బయటి ప్రపంచానికి చాలా తేడా ఉంటుందని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే పరిస్థితులను విద్యార్థులు అనుకూలంగా మార్చుకుంటూ ముందుకుసాగాలన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకుంటే సమాజంలో మెరుగైన గౌరవం దొరుకుతుందన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సమావేశ సమన్వయకర్త అధ్యాపకుడు సంజీవరాజు, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. ఇంద్రనీల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కెప్టెన్ డాక్టర్ కె. రవీంద్రబాబు, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న వెంకటేశం

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు కరీంనగర్‌కు చెందిన ఆనంద్ స్వీట్ హౌజ్ యజమాని రూ. పదివేల విలువ గల నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ సన్నీల్ల వెంకటేశం, ఎస్ఎంసీ చైర్మన్ మంద శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం కోల రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణకుమారి, ఉపేందర్, అంగన్‌వాడీ టీచర్ పద్మ, దిలీప్ పలువురు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



హుజూరాబాద్‌లో ప్రచారం చేస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్: దేశ హితం కోసం అహర్నిశలు కృషి చేస్తూ పరిపాలన విధానాలతో దేశం దిశా దశను పీఎం మోదీ ప్రభుత్వం మార్చిందని, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ప్రపంచ దేశాలు దేశం వైపు చూసే విధంగా పాలన కొనసాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా హుజూరాబాద్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు మోదీ ప్రభుత్వ పనితీరుపై పూర్తి విశ్వాసం నమ్మకంతో ఉన్నారని పేర్కొన్నారు.

చొప్పదండి: దేశ వ్యాప్తంగా ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గుమ్లాపూర్‌లో మహాజన సంపర్క్ కార్యక్రమం నిర్వహించారు.

గంగాధర: ప్రధాని మోదీ తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. మధురానగర్‌లో పార్టీ చొప్పదండి కనీనర్, జిల్లా కోశాధికారి వైద రామానుజం, నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి, రంగాపూర్ సర్పంచ్ బింగి కరుణాకర్, బూత్ అధ్యక్షులు ప్రచారం చేశారురు.

జమ్మికుంట: మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ అన్నారు. పట్టణంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ భివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించి కరపత్రాలు అందజేశారు.

మానకొండూరు/మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూరు, ఈదులగట్టపల్లి గ్రామాలలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మానకొండూరు నియోజకవర్గ ఇన్చార్జి గడ్డం నాగరాజ్, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలో కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్, నాయకులు పంపిణీ చేశారు. కేంద్రం విడుదల చేసిన నిధులు వివరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్‌లో నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికి వివరించారు. పార్టీ మండల ప్రధానకార్యదర్శి పైడిపెల్లి శ్రీనివాస్, కొండాపూర్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి కంది శంకర్, మాజీ సర్పంచ్ వంగర మల్లేశం, ఉప సర్పంచ్ మట్ట శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండల ప్రధానకార్యదర్శి రవీందర్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రైమరీ స్కూళ్లకు ట్యాబ్‌లు

- నేడు జిల్లా కేంద్రంలో పంపిణీ
- తప్పనున్న ఆన్‌లైన్ కష్టాలు
- స్టూడెంట్స్ ఇన్ఫర్మేషన్ ట్యాబ్‌లో నిక్షిప్తం



మానకొండూర్: రోజురోజుకు సాంకేతికత పెరుగుతోంది. ప్రతిపనికి ఇంటర్నెట్ సౌకర్యాలు చాలా వరకూ అవసరమవుతున్నాయి. ప్రతీది ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటర్నెట్ వద్దకు వెళ్లాల్సి వస్తుంది. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డాటా, పాఠశాలకు సంబంధించిన సమాచారం ఏ రోజుకారోజు ఎప్పటికప్పుడు అప్‌లోడు చేయాల్సి వస్తుండటంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ ఇక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేయనుంది. నేడు శుక్రవారం జిల్లా కేంద్రంలోని సెయింట్ అల్ఫోన్స్ స్కూల్లో ట్యాబ్‌లను జిల్లా విద్యాధికారి చేతుల మీదుగా మండల విద్యాధికారుల సమక్షంలో ఎంపిక చేసిన ఆయా పాఠశాలలకు మండలాల వారీగా అందజేయనున్నారు.

జిలాల్లో 435 ప్రాథమిక పాఠశాలల ఎంపిక

జిలాల్లోని 16 మండలాల్లో పదికంటే ఎక్కువ విద్యార్థులన్నా 435 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ట్యాబ్‌లు ఇచ్చేందుకు ఎంపిక చేశారు. ట్యాబ్‌లు సిమ్ ఆధారితమైనవి, ట్యాబ్‌లను తీసుకున్న తర్వాత స్కూల్ స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ట్యాబ్ స్కూల్ ప్రాపర్టీకి చెందినది. దీనికి ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు లేదా ప్రధానోపాధ్యాయుడు బాధ్యత వహిస్తాడు. వారు బదిలీ అయితే బదిలీ అయిన స్థానంలో వచ్చిన ఉపాధ్యాయుడికి, లేదా ప్రధానోపాధ్యాయుడికి ఈ ట్యాబ్‌ను అప్పగించాల్సి ఉంటుంది.

నేడు జిల్లా కేంద్రంలో పంపిణీ

జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆల్ఫోన్స్ స్కూల్లో ట్యాబ్‌లను మండలాల వారీగా జిల్లా విద్యాధికారి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఇల్లందకుంట, జమ్మికుంట, సైదాపూర్, హుజురాబాద్, వీణవంక, శంకరపట్నం, కరీంనగర్, గంగధర, మండలాల ప్రదానోపాధ్యాయులకు పంపిణీ చేయనుండగా, మధ్యాహ్నా 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ గన్నేరువరం, తిమ్మాపూర్, రామడుగు, మానకొండూర్, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్, చిగురుమామిడి మండలాలకు ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. పంపిణీ అనంతరం ట్యాబ్‌లో విద్యార్థుల సమాచారం నిక్షిప్తం చేయడంపై త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు.

మాజీ మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న సుద్దాల దేవయ్య

గంగాధర: మండలంలోని ఆచంపల్లి గ్రామానికి చెందిన యువకుడ బోగోజి గణేశ్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు సుద్దాల దేవయ్య పరామర్శించారు. అనంతరం రూ.ఐదువేల ఆర్థికసాయం అందించారు.

లింగాపూర్‌లో..

మానకొండూర్‌రూరల్: మండలంలోని లింగాపూర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాల్సాని గణేశ్‌రావు తండ్రి జగన్నాథరావు గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. సుడాచైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట సంతోష్, కిరణ్, కొమురయ్య, దేవేందర్ రావు, రమేష్, సురేందర్, దిలీప్ ఉన్నారు.